క్లుప్తంగా

దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రవీందర్

సిరిసిల్లకల్చరల్/సిరిసిల్ల టౌన్: హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సమితి గౌరవాధ్యక్షుడు ఆడెపు రవీందర్ పిలుపునిచ్చారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రామ్‌లీలా మైదానంలో (బతుకమ్మ ఘాట్) జరిగే రావణ సంహార దృశ్యాన్ని తిలకించేందుకు తరలిరావాలన్నారు. విశ్వహిందూ పరిషత్, సామాజిక సమరసతా వేదిక తెలంగాణ ప్రాంత సమన్వయ కర్త లింగంపేట ధనుంజయ్ హాజరవుతున్నారన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమితి ప్రతినిధులు శ్రీధర్, గాజుల వేణు, మేర్గు సత్యనారాయణ, బైరగోని వెంకన్న, వేముల పోశెట్టి, తాటిపాముల సత్యం, పోతు శ్రీనివాస్, బొజ్జ శ్రీనివాస్, సదానందం, గోనె మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జర్నలిస్టులు



కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న జర్నలిస్టు యూనియన్ ప్రతినిధులు

సిరిసిల్లఅర్బన్: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన హరితను టీయూడబ్ల్యూజే నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా, ప్రధాన కార్యదర్శి సామల గట్టు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజీమ్, కోశాధికారులు అందె దేవేందర్, సయ్యద్ కలీంలతో పాటు జర్నలిస్టులు పూలమొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్‌కార్డులు అందించేందుకు కృషి చేస్తామన్నారు. తంగళ్లపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యవర్గం, ఇల్లంతకుంట ప్రెస్‌క్లబ్ అధ్యక్షులతోపాటు కార్యవర్గం, ఎల్లారెడ్డిపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు సంపత్‌కుమార్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వైన్స్‌కు 48 దరఖాస్తులు

సిరిసిల్లక్రైం: జిల్లాలో బుధవారం నాటికి వైన్స్‌లకు 48 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 48 వైన్స్‌లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. బుధవారం ఒక్కరోజే 41 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

హనుమంతుడి వాహనంపై ఊరేగింపు



ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లోని శ్రీ సీతా రామచంద్రస్వామి ఆలయంలో బుధవారం దసరా పండుగ ఉత్సవాలను వేద పండితులు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా హనుమంతుడి వాహనంపై స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఉంచి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. గురువారం అశ్వ వాహనంపై, గరుడ వాహనంపై స్వామివారిని ఊరేగించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోతే లక్ష్మారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు నిమ్మ నారాయణరెడ్డి, సూర నర్సయ్య, లద్దునూరి హన్మండ్లు, బొమ్మడి రాజలింగం, మహిళలు పాల్గొన్నారు.

దసరాకు ఏర్పాట్లు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పలు గ్రామాల్లో దసరా పండుగకు అధికారులు అన్నిఏర్పాట్లు చేస్తున్నారు. మండలకేంద్రంలో పెద్దబడి వద్ద జరిగే దసరా ఉత్సవాల కోసం కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో హైమాస్ట్ లైట్లను క్రేన్ సాయంతో మరమ్మతు చేశారు. పలు గ్రామాల్లో జమ్మి గద్దెలను సిద్ధం చేశారు.

చిటికెన కిరణ్‌కు సత్కారం



కిరణ్‌ను సత్కరిస్తున్న జూకంటి జగన్నాథం

సిరిసిల్లకల్చరల్: పట్టణానికి చెందిన వ్యాసకర్త మానేరు రచయితల సంఘం ప్రతినిధి చిటికెన కిరణ్‌కుమార్‌ను ప్రముఖ కవి జూకంటి జగన్నాథం బుధవారం సత్కరించారు. అఖిల భారత పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ వడ్డేపెల్లి కృష్ణస్మారక జాతీయ సాహిత్య పురస్కారం అందుకున్న సందర్భంగా సత్కరించారు. ఈ సందర్భంగా కిరణ్‌ను మానేరు రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గెంట్యాల భూమేశ్, ఆడెపు లక్ష్మణ్, ఎలగొండ రవి, బూర దేవానందం, అంకారపు రవి, వెంగల లక్ష్మణ్ తదితరులు అభినందించారు.



ముస్తాబాద్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఘనంగా సద్దుల బతుకమ్మ

ముస్తాబాద్ మండంలోని పలు గ్రామాల్లో సద్దుల బతుకమ్మ సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. తంగేడు, గునుగు, చామంతి, బంతిపూలతో బతుకమ్మలను పేర్చి ప్రధాన కూడళ్ల వద్ద ఉంచి మహిళలు ఉత్సాహంగా ఆడిపాడారు. ముస్తాబాద్, నామాపూర్, మొర్రాయిపల్లె గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు జరిగాయి. ముస్తాబాద్ శివకేశవుల ఆలయం, మార్కెట్‌లో శివాలయం, పెద్దబడి, గోదాం, హన్‌మాన్‌నగర్, రాజీవ్‌నగర్‌లో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. పోయిరా.. బతుకమ్మ మళ్లీ రావమ్మా.. అంటూ పెద్ద చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. మహిళలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

– ముస్తాబాద్



శివకేశవుల ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ముస్తాబాద్ గోదాం వద్ద ..



బతుకమ్మలు నిమజ్జనం చేస్తున్న మహిళలు

ఎన్నికల నియమావళి పాటించాలి



వేములవాడ అర్బన్ : మాట్లాడుతున్న ఎంపీడీవో రాజీవ్‌మల్హోత్ర



ఎల్లారెడ్డిపేట: సమావేశమైన అధికారులు

వేములవాడఅర్బన్: వేములవాడ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని ప్రతీ ఒక్కరు పాటించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయప్రకాశ్ రావు, వేములవాడ టౌన్ ఎస్సై రామ్‌మోహన్, వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చందుర్తి: స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పా ర్టీలు సహకరించాలని ఎంపీడీవో ఎల్.రాధ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్, నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల ప్రచారం, ప్రచార ఖర్చులు, ఓటింగ్ ప్రక్రియ, ఫలితాల వెల్లడి తదితర అంశాలను పార్టీ ప్రతిని ధులకు వివరించారు. ఎంపీవో బండి ప్రదీప్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ రమాదేవి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండల పరిషత్‌లో ఎన్నికల ప్రవర్తన నియామవళిపై ఎంపీడీవో లచ్చాలు అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ అనుమతులు లేకుండా బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించవద్దన్నారు. మద్యం, డబ్బు పంపిణీ చేయవద్దని, ఓటర్లను ప్రలోభపెట్టవద్దని సూచించారు. ఎంపీవో వాహిద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్ రావు, ప్రశాంత్, బాల్‌రెడ్డి, విజయ్‌రెడ్డి తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల పరిషత్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో జోగం రాజు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు మురళిమోహన్‌గౌడ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, బీజేపీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, బీఎస్పీ మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



ఎమ్మెల్యే సత్యంను సత్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్

బోయినపల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. ఏఎంసీ చేర్మెన్ బోయిని ఎల్లేశ్ యాదవ్ ఆధ్వర్యంలో బోయినపల్లి గ్రామ నాయకులు బుధవారం ఎమ్మెల్యే సత్యంను కలిసి సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి మహేశ్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్‌రెడ్డి, మోహన్ తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు అభినందన

సిరిసిల్లటౌన్: అంతర్‌జిల్లా కబడ్డీ పోటీల్లో రాణించిన ఖేలో ఇండియా కబడ్డీ జిల్లా క్రీడాకారులను డీవైఎస్‌వో అజ్మీరా రాందాస్ బుధవారం అభినందించారు. రాష్ట్రస్థాయిలో నిజామాబాద్‌లో జరిగిన 35వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ తెలంగాణ అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు రాణించారన్నారు. ఆయనతో పాటు కోచ్ ప్రశాంత్‌యాదవ్ ఉన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బండలింగంపల్లిలో రజక సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు బుధవారం ఏకగ్రీవంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా గంగాసరం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా గంగాసరం చంద్రయ్యను ఎన్నుకున్నారు. వీరితో పాటు కార్యవర్గం సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం సభ్యులను ఘనంగా సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

• ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించాలి

వీర్నపల్లి: మండలంలోని బంజేరు గ్రామ పంచాయతీకి స్థానిక ఎన్నికల్లో ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించాలని అంబేడ్కర్‌నగర్ కాలనీ దళితులు కోరారు. 8 వార్డుల్లో 718 మంది ఓటర్లు ఉండగా, ఎస్సీలున్న మూడు వార్డుల్లో కలిపి 240 మంది ఓటర్లు ఉన్నారు. ప్రభుత్వం 3 వార్డులకు ఎస్సీ రిజర్వేషన్ కేటాయించాలని కోరారు. అంబేడ్కర్‌నగర్ వాసులు, తదితరులు ఉన్నారు.

• ఎంపీడీవోకు వినతి

వీర్నపల్లి: బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్ ఎంపీడీవో బీరయ్యకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం ఏ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కేటాయింపులు జరిపిందో తెలపాలన్నారు. మండలానికి ఒక్క ఎంపీటీసీ స్థానాన్ని, పలు గ్రామాల్లో తప్పిదాలు జరిగిన చోట వార్డుల్లో ఎస్సీలకు చోటు కల్పించాలని విజ్ఞప్తి చేశాడు ఆయన వెంట లింగంపల్లి శంకర్, తదితరులున్నారు.

• అడవిపందుల దాడిలో పంట ధ్వంసం

రుద్రంగి: మండలకేంద్రంలో గంగం మల్లేశంకు చెందిన పంటను మంగళవారం అర్ధరాత్రి అడవిపందులు ధ్వంసం చేశాయి. పొట్టదశలో ఉన్న వరి పంటను ధ్వంసం చేయడంతో తీవ్రనష్టం వాటిల్లిందని రైతు గంగం మల్లేశం తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

• సెల్‌ఫోన్ అప్పగింత

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌కు చెందిన బి.హరిబాబు రెండ్రోజుల క్రితం ముస్తాబాద్‌లో సెల్‌ఫోన్ పొగొట్టుకున్నాడు. హెడ్‌కానిస్టేబుల్ భూమయ్య దుర్గామాత ఉత్సవాల్లో బందోబస్తు నిర్వహిస్తుండగా బుధవారం సెల్‌ఫోన్ దొరికింది. ఎస్సై గణేశ్‌కు సమాచారం ఇవ్వగా, విచారణ చేసి పోతుగల్‌కు చెందిన హరిబాబుదిగా గుర్తించారు. ఈ మేరకు హరిబాబుకు సెల్‌ఫోన్‌ను అందించారు.

• మహిషాసుర దహనానికి ఏర్పాట్లు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని ఫెండ్స్ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిషాసుర దహనానికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. మానేరునది ఒడ్డున లక్ష్మి నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించే కార్యక్రమానికి గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరుకావాలన్నారు. ప్రధాన కార్యదర్శి సామల గణేశ్, ఉపాధ్యక్షుడు రంగు అంజయ్య, సహాయ కార్యదర్శి ముక్క శ్రీనివాస్, కోశాధికారి జూకంటి శంకర్, సాంస్కృతిక కార్యదర్శి ఏర శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• ఆర్‌ఎస్‌ఎస్ సమావేశం

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని ఆర్యవైశ్య భవన్‌లో బుధవారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య వక్త కరీంనగర్ జిల్లా కళాశాల విద్యార్థి ప్రముఖ మాటూరి లింగమూర్తి పాల్గొని విజయదశమి ఉత్సవం గురించి మాట్లాడారు. కార్యక్రమంలో చొప్పరి రామచంద్రం, తాటిపల్లి మహేశ్, కాసుపాక కిషన్, బొల్లం ధనుంజయ్, డాక్టర్ జగన్మోహన్రావు, రామకృష్ణ, రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: ఆర్‌ఎస్‌ఎస్ వీర్నపల్లి శాఖ ఆధ్వర్యంలో పెద్దమ్మ దేవాలయంలో ముందస్తు విజయదశమి వేడుకలు నిర్వహించారు. ప్రధాన వక్తగా ఖండ శారీరిక్ ప్రముఖ్ నెవురి శివారెడ్డి పాల్గొని మాట్లాడారు. మండల ఉపమండల ప్రముఖ్ పిట్ల ఖాజీబాబు, మాడుగుల లింబాద్రి పాల్గొన్నారు.

బోయినపల్లి: ఆర్‌ఎస్‌ఎస్ బోయినపల్లి, విలాసాగర్ ఉపఖండల్లో గణేశ దారి స్వయంసేవకుల సాంగిక్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సమావేశం నిర్వహించారు. సంఘ్ సేవకులు, పుల్లారెడ్డి, సంఘం నాయకులు శివయ్య, సభ్యులు నర్సింహచారి, రవీందర్ రెడ్డి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల దినోత్సవం



సిరిసిల్లటౌన్: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సిరిసిల్ల పౌరసంక్షేమ సమితి ఆధ్వర్యంలో బుధవారం వేడుకలు నిర్వహించారు. సీనియర్ సిటిజన్ కోడం కృష్ణహరి చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. సమితి అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ వయోవృద్ధుల దినోత్సవాన్ని అధికారికంగా ప్రభుత్వం నిర్వహించాలని కోరారు. సమితి ఉపాధ్యక్షుడు చీకోటి అనిల్‌కుమార్, సహాయ కార్యదర్శి కుసుమ గణేశ్, కోశాధికారి చిప్ప దేవదాస్, సభ్యులు వేముల పోశెట్టి, దేవులపల్లి శ్రీరాములు, మల్లేశం పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



తంగళ్లపల్లి ఆరోగ్యకేంద్రంలో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

తంగళ్లపల్లి: ప్రజలకు మెరుగైన వైద్యసేవందించాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రజిత అన్నారు. బుధవారం తంగళ్లపల్లి, నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. గర్భిణులను గుర్తించి పౌష్టికాహారం, టీకాలపై అవగాహన కల్పించాలన్నారు. మెడికల్ అధికారులు డా. అఫిజా, చంద్రికరెడ్డి,వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సేవ అందరి లక్ష్యం కావాలి



ముస్తాబాద్: సామాజిక సేవ అందరి లక్ష్యం కావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సామాజిక సేవ కార్యకర్త ముత్యాల నర్సింహారెడ్డిని ముస్తాబాద్‌లో బుధవారం సన్మానించారు. వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సామాజిక సేవ కార్యక్రమాలను చేపట్టిన నర్సింహారెడ్డిని ఏషియన్ రీసెర్చ్ అకాడెమీ డాక్టరేట్‌తో సత్కరించడంపై హర్షం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత శోభాయాత్ర



తంగళ్లపల్లి: మండలంలోని బస్వాపూర్‌లో బుధవారం దుర్గామాత శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న జగన్మాతను గ్రామంలో డప్పు చప్పుళ్లు, నృత్యాల మధ్య ఊరేగించి నిమజ్జనం చేశారు. గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కురుమసంఘం అధ్యక్షుడిగా బాలయ్య



ఇల్లంతకుంట: మండల కురుమ సంఘం అధ్యక్షుడిగా బైరి బాలయ్య ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా ఒగ్గు నరసయ్య, సలహాదారులుగా చెలిమిళ్ల కనకయ్య, ఉపాధ్యక్షులుగా చెలిమిళ్ల శీను, మేకల ఐలయ్య, ఏ గుర్ల రాము, ప్రధాన కార్యదర్శిగా పర్స ఐలయ్య, సహాయ కార్యదర్శిగా బైరి కనకయ్య, దయ్యాల రామకృష్ణ, కోశాధికారిగా ఏగుర్ల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా బైరి రాయమల్లు, ఏగుర్ల శ్యాం, చుక్క బాబు, పరాధ మల్లయ్య, బైరి చిన్న బాలయ్య, అడితం బాలయ్య, బండారి మహేశ్, బైరి ముత్తయ్య ఎన్నికయ్యారు.

మద్యం విక్రయాలు బంద్

- గ్రామాల్లో కనిపించని బెల్టుషాపులు
- గ్రామ పంచాయతీల తీర్మానం
- హరితహారం, స్వచ్ఛతలోనూ ఆదర్శం



నారాయణపూర్ గ్రామం

ఎల్లారెడ్డిపేట: అహింస..మద్యపాన నిషేధం..స్వచ్ఛ భారత్‌ను పాటిస్తూ గాంధీచూపిన మార్గంలో పల్లెలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. మండలంలోని నారాయణపూర్, పదిర, హరిదాస్‌నగర్, దుమాల గ్రామాల్లో మద్యం విక్రయాలు నిషేధించారు. మద్యంఅమ్మితే రూ.5వేలు జరిమానా విధిస్తామనే నిబంధనను గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో ఏకగ్రీవ తీర్మానించారు. రెండు దశాబ్దాలుగా ఆయాగ్రామాల్లో గ్రామస్తులు ఒకేతాటిపైకి వచ్చి సంపూర్ణ మద్యం విక్రయాలు అమలుచేస్తున్నారు. హరితహారంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి రోడ్లవెంట పచ్చదనంతో స్వాగతం పలుకుతున్నాయి. ట్రాక్టర్లతో తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరిస్తూ డంపింగ్‌యార్డుకు తరలిస్తూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. వర్మీ కంపోస్టు ద్వారా ఆదాయం సైతం పొందుతున్నారు. వచ్చిన ఆదాయంతోనే పంచాయతీలో ఉండే ఖర్చులను వెళ్లదీస్తున్నారు.

అభివృద్ధే లక్ష్యంగా..

మద్యపాన నిషేధం ఒక్కటే కాకుండా నాలుగు గ్రామాల్లో నిత్యం చెత్తను తొలగిస్తూ పరిశుభ్రతలో ఆదర్శంగా నిలుస్తున్నారు. మురుగుకాలువలు, సీసీరోడ్లు, పాఠశాలల్లో అభివృద్ధి పనులు ఇలా అన్నింట్లో ముందుంటున్నారు. ఒకప్పుడు నక్సలైట్ల ఉద్యమంలో ఎంతోమంది అజ్ఞాతంలోకి వెళ్లి అమరులయ్యారు. ప్రస్తుతం అడవిబాట వీడి అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

ఆహ్లాద వాతావరణంలో..

హరితహారంలో భాగంగా రోడ్డు కిరువైపులా మొక్కలు నాటగా నేడు మహా వృక్షాలుగా మారి వాహనదారులకు ఆహ్లాదం పంచుతున్నాయి. మొక్కలు నాటడమే కాకుండా సంరక్షిస్తున్నారు.

స్వచ్ఛత, మొక్కలపెంపకంపై దృష్టి



తాను సర్పంచ్‌గా పనిచేసిన సమయంలో గ్రామంలో స్వచ్ఛత, మొక్కల పెంపకంపై దృష్టిసారించాం. నిత్యం తడి, పొడి చెత్తను సేకరించి గ్రామాన్ని స్వచ్ఛతలో ముందుంచాం. మురుగు కాలువలు శుభ్రంచేశాం. రోడ్డు కిరువైపులా నాటిన మొక్కలు నేడు మహావృక్షాలుగా మారాయి.

– నిమ్మ లక్ష్మి, మాజీ సర్పంచ్, నారాయణపూర్

స్వచ్ఛతలో జాతీయ అవార్డు



నేను సర్పంచ్‌గా ఉన్నప్పుడు గ్రామంలో స్వచ్ఛతపై దృష్టి సారించా. జాతీయస్థాయిలో స్వచ్ఛతలో అవార్డు రావడం ఆనందంగా ఉంది. గ్రామాన్ని పచ్చదనంగా ఉంచాలనే లక్ష్యంతో ఇంటింటికీ ఐదు మొక్కలు పంపిణీ చేశాం. స్వచ్ఛత, పచ్చదనంలో గ్రామం ఆదర్శంగా నిలుస్తోంది.

– చీటి లక్ష్మణ్‌రావు, మాజీ జెడ్పీటీసీ, హరిదాస్‌నగర్

యువత మత్తుకు దూరంగా ఉండాలి

- బైక్‌యాత్రతో ఉపాధ్యాయుడి ప్రచారం



బైక్ యాత్రికుడు ప్రభాకర్‌కు స్వాగతం పలుకుతున్న ముస్తాబాద్ ప్రజలు

ముస్తాబాద్: డ్రగ్స్, గంజాయి మత్తు నుంచి యువత దూరంగా ఉండాలని కోరుతూ సూర్యాపేట జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ చేపట్టిన బైక్‌యాత్ర బుధవారం ముస్తాబాద్‌కు చేరుకుంది. ప్రభాకర్‌కు చిప్పలపల్లి గ్రామస్తులు మాచెట్టి లక్ష్మణ్, ఆగమ్‌రెడ్డి స్వాగతం పలికారు. ప్రభాకర్ మాట్లాడుతూ తన స్నేహితుడి కొడుకు గుట్కాలు తిని గొంతు క్యాన్సర్‌తో మరణించడంతో చలించిపోయి.. యువతను మత్తు పదార్థాల నుంచి దూరంగా మళ్లించేందుకు ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ప్రభాకర్.. దసరా సెలవులను ఇలా సద్వినియోగం చేసుకుంటున్నారు.

దుర్గామాత నమోస్తుతే



బోయినపల్లి: తడగొండ దుర్గామాత మండపం వద్ద మహిళల దీపాలంకరణ



ఇల్లంతకుంట: గంగాధర క్షేత్రాలయంలో కుంకుమపూజలు చేస్తున్న మహిళలు

ముస్తాబాద్/కోనరావుపేట/ బోయినపల్లి/ ఎల్లారెడ్డిపేట/ ఇల్లంతకుంట: ముస్తాబాద్ మండలం ఆవునూర్‌లో నవదుర్గ యంగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం అమ్మవారికి మహిళలు కుంకుమపూజలు చేసి కొలిచారు. ప్రత్యేక పూజలు చేసి ఒడిబియ్యం సమర్పించారు. భక్తులకు అన్నప్రసాదం అందించారు. కోనరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కనగర్తిలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలోని గౌడసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాగుల ఎల్లమ్మ ఆలయం, శ్రీ గీతా మందిరంలో మహిళలు కుంకుమపూజలు చేశారు. మహిషాసుర మర్ధిని అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి అమ్మవారికి పూజలు చేశారు. గౌడ సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు. బోయినపల్లి మండలం తడగొండలో దీపాలంకరణ చేశారు. ఇల్లంతకుంట మండలకేంద్రంలోని గంగాధర క్షేత్ర ఆలయంలో కుంకుమార్చన పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. హిందూ వాహిని సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద మహా చండీయాగం మహిషాసుర మర్దిని రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు.



ముస్తాబాద్: ఆవునూర్‌లో కుంకుమపూజలు చేస్తున్న మహిళలు

'స్థానిక' ఎన్నికలపై కలెక్టరేట్‌లో హెల్ప్‌లైన్

- ప్రారంభించిన అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్



హెల్ప్‌లైన్‌ను ప్రారంభించిన అదనపు కలెక్టర్

సిరిసిల్ల: కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో హెల్ప్‌లైన్ (ఫిర్యాదుల) కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్ బుధవారం ఏర్పాటు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని అందిస్తారని, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులకు సలహాలు, సూచనలను ఈ హెల్ప్‌లైన్‌లో అందిస్తారని పేర్కొన్నారు. ఎన్నికల విషయమై ఫిర్యాదులు స్వీకరిస్తారని అదనపు కలెక్టర్ తెలిపారు. జెడ్పీ డిప్యూటీ సీఈవో గీత, ఇతర అధికారులు పాల్గొన్నారు.